సర్కారు తీరుతో మొదటికే మోసం

- జిల్లాలో 42.90 శాతమే ఆస్తి పన్ను వసూలు
- భూపాలపల్లి మున్సిపాలిటీలో 26.92 శాతమే
- సింగరేణి నుంచి రావాల్సినవి రూ.2.58 కోట్లు
- ప్రత్యేక విధులకు బిల్ కలెక్టర్లు, కారోబార్లు
- ఆగమేఘాలతో స్పెషల్ డ్రైవ్
- పనిభారంతో సిబ్బంది సతమతం

భూపాలపల్లిలో స్పెషల్ డ్రైవ్ లో మున్సిపల్ సిబ్బంది

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ) : సర్కారు తీరుతో గ్రామ, మున్సిపల్ రెవెన్యూకు గండి పడుతున్నది. పన్నుల వసూళ్లలో కీలక పాత్ర పోషించే బిల్ కలెక్టర్లు, కారోబార్లను ప్రభుత్వం సర్వేలు, గ్రామ సభలకు వినియోగిస్తుండడంతో ఏడాది కాలంగా పన్నుల వసూళ్లు నిలిచిపోయాయి. సిబ్బంది తమకు వీలు దొరికినప్పుడల్లా వసూలు చేస్తున్నప్పటికీ లక్ష్యానికి చేరువ కాలేకపోతున్నారు. జిల్లాలోని 11 మండలాల్లో ఇప్పటి వరకు కేవలం 42.90 శాతం, భూపాలపల్లి మున్సిపాలిటీలో 26.92 శాతం మాత్రమే పన్నుల వసూళ్లు జరిగాయి. సింగరేణి సంస్థ నుంచి రూ. 2.58 కోట్లు రావాల్సి ఉంది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో రెండు నెలలు మాత్రమే మిగిలి ఉండగా పన్ను వసూళ్ల లక్ష్యం చేరుకునేందుకు అధికారులు ఆగమేఘాలతో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఏడాది పొడవునా తమను సర్వేలు, సభలకు వాడుకుని, ఈ రెండు నెలల్లో లక్ష్యాలను చేరుకోవాలని ఒత్తిడి తేవడం ఎంతవరకు సమంజసమని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర పనిభారంతో సతమతమవుతున్నామని చెప్తున్నారు.

జిల్లాలో 42.90 శాతమే

జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం 11 మండలాల్లో కేవలం 42.90 శాతం మాత్రమే ఆస్తి పన్నులు వసూలయ్యాయి. ఈ రెండు నెలల్లో ఇంకా రూ. 2.30 కోట్లు వసూలు కావాల్సి ఉంది. మొగుళ్లపల్లి మండలంలో 64.11 శాతం, కాటారం 54.79 శాతం, మహదేవ్‌పూర్ 51.90 శాతం, చిట్యాల 50.62శాతం, భూపాలపల్లి 48.77 శాతం, టేకుమట్ల 43.64 శాతం, రేగొండ 41.23 శాతం, పలిమెల 34.49 శాతం, మహాముత్తారం 33.91 శాతం, గణపురం 33.55 శాతం, మల్హర్ మండలంలో 15.14 శాతం పన్నుల వసూళ్లు జరిగాయి. రేగొండ, పలిమెల, మహాముత్తారం, గణపురం, మల్హర్ మండలాలు వెనుకంజలో ఉన్నాయి.

మున్సిపాలిటీలో 26.92 శాతమే..

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో 26.92 శాతం మాత్రమే పన్నులు వసూలయ్యాయి. మొత్తం రూ.7.31 కోట్లు ఆస్థి పన్ను వసూలు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.1.96 కోట్లు (26.92 శాతం)మాత్రమే వసూలయ్యాయి. ఇంకా రూ. 5.34 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇందులో సింగరేణి సంస్థకు సంబంధించి రూ. 2.58 కోట్ల బకాయిలు ఉన్నాయి. అయితే యూసీ (అన్‌కండిషనల్ కన్‌స్ట్రక్షన్స్) టాక్స్ తీసేయాలని సింగరేణి అధికారులు కోరుతుండగా 40 శాతం రెసిడెన్షియల్, 10 శాతం కమర్షియల్ రిబేట్ ఇస్తున్నా సింగరేణి అధికారులు టాక్స్ చెల్లించడం లేదని మున్సిపల్ అధికారులు తెలుపుతున్నారు. ఈ విషయమై ఇరువర్గాల పంచాయితీ క్లియర్ చేసే టైంలోనే ఇక్కడ అదనపు కలెక్టర్‌గా పనిచేసిన దివాకర ములుగుకు బదిలీ అయ్యారు. మొత్తం మీద జిల్లాలో , మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వార్డు సభలు, ప్రజాపాలన వారోత్సవాలు, సమగ్ర కుటుంబ ఇంటింటా సర్వే, నాలుగు పథకాల గ్రామ సభలు, వార్డు సభలు ఇలా సిబ్బందిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవడంతో గ్రామాల్లో, మున్సిపాలిటీలో పన్నుల వసూళ్లు అటకెక్కాయి.

సౌర శక్తితో రైతులకు ఆదాయం

ములుగురూరల్, ఫిబ్రవరి 3 : ములుగు జిల్లాలోని రైతులు వారికి సంబంధించిన బంజరు భూములు, వ్యవసాయానికి అనుగుణంగా లేని భూముల్లో సౌర శక్తిని ఉత్పత్తి చేసి ఆదాయాన్ని పొందాలని డీఈ నాగేశ్వర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల వారు సోలార్ ప్లాంట్లు పెట్టుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల రైతులు ఈ నెల 22లోగా www.tgredco.telangana.gov.inలో లాగిన్ అయ్యి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సందేహాలకు రెడ్కో డీజీఎం 6304903933, డీఎం 9000550974 నంబర్లను సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 3 : దివ్యాంగుల ఆర్థిక పునరావాస పథకానికి జిల్లాలోని అర్హులైన దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించే గడువును ఈ నెల 12 వరకు పొడిగించినట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి కే చిన్నయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జనవరి 23 నుంచి ఫిబ్రవరి 2 వరకు దరఖాస్తు స్వీకరణ చేపట్టగా, సంచాలకులు దివ్యాంగుల శాఖ, ఆదేశాల మేరకు తేదీని పొడిగించినట్లు పేర్కొన్నారు. దివ్యాంగులు www.tsob mms.gov.inలో దరఖాస్తులు సమర్పించాలని, వివరాలకు 96523 11804 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తు గడువు పెంపు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 3 : పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ దరఖాస్తు గడువును పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో జిల్లాలోని వివిధ కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఫ్రెష్, రెన్యూవల్ దరఖాస్తులను www.telanganaepass.cgg.gov.in ద్వారా మార్చి 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు అర్హులైన విద్యార్థులందరూ ఉపకార వేతనాల కోసం రిజిస్టర్ చేసుకునేలా చూడాలని ఆమె సూచించారు.

బాధ్యతలు స్వీకరిస్తున్నరాంప్రసాద్

గోరికొత్తపల్లి ఎంపీడీవోగా రాంప్రసాద్ బాధ్యతలు

రేగొండ, ఫిబ్రవరి 3 : గోరికొత్తపల్లి ఎంపీడీవోగా రాంప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రేగొండ ఎంపీవోగా ఉన్న ఆయను ఎంపీడీవోగా నియమిస్తూ కలెక్టర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ ఇక నుంచి ప్రభుత్వ పాఠశాలలో ఒక గదిని కార్యాలయంగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలకు ఎలాంటి అవసరాలున్నా నేరుగా రావాలని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

BUILDING FOR SALE
★H.No: 2-6-75, Circuit House, Nakalgutta Hanamkonda, Ground floor Bldg, 160.7 Sq.yds, 1000 sqft RCC buildup area, East Facing, 1.15 Cr. Clear tittle, Brokers pls excuse. **Contact: 9949912347, 999896 12347, 63025 53816.**
NTW-000

CHANGE OF NAME
★I, **Seelam Mani Chandana** (NEW NAME), R/O H. No 4-42, Narashimhula Gudem Village, Kusumanchi Mandal, Khammam Dist, 507159 Telangana State, India, changed my name from **Seelam Dimple** (OLD NAME) to **Seelam Mani Chandana** (NEW NAME) for all purposes.
NTW-000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

వెంకటాపూర్ : పట్టుకున్న గుడుంబాతో ఎక్సైజ్ అధికారులు

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

ములుగురూరల్/వెంకటాపూర్, జనవరి 3 : ములుగు మండలంలోని అబ్బాపురం, జాకారం, శ్రీరాములపల్లి గ్రామాలతో పాటు మల్లంపల్లి మండల కేంద్రం, వెంకటాపూర్ మండల పరిధిలోని ఇంచన్‌చెర్వుపల్లి, మల్లయ్యపల్లి, నల్లగుంట గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు స్టేట్ ఫోర్స్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్‌రావు సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ములుగు, భూపాలపల్లి ఎక్సైజ్ స్టేషన్లతో పాటు టాస్క్‌ఫోర్స్, వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వెంకటాపూర్ పోలీస్ సిబ్బందితో కలిసి సంయుక్తంగా దాడులు చేశామని పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఆయా గ్రామాలకు చెందిన 8 మంది నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే, 46 లీటర్ల గుడుంబా, 100 కిలోల చక్కెర, నాలుగు కిలోల ఈస్ట్ పౌడర్‌ను స్వాధీనం చేసుకొని, 1300 లీటర్ల పులియబెట్టిన చక్కెర పానకాన్ని ధ్వంసం చేసినట్లు వివరించారు. గుడుబా తయారీతో పాటు విక్రయాలు జరిపే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలహాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు వివరించారు. దాడుల్లో భూపాలపల్లి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ లింగయ్య, ములుగు ఎక్సైజ్ సీఐ సుధీర్‌కుమార్, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ రాజసమ్మయ్య, ఎస్సైలు లింగయ్య, రజిత, బాలరాజు, రాజయ్య, సతీశ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

పవన్(ఫైల్)

టేకుమట్ల, ఫిబ్రవరి 3 : మండలంలోని రాఘవాపూర్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పంచిక పవన్ (19) అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. చిట్యాల మండలం గిద్దెముత్తారం గ్రామానికి చెందిన పంచిక పవన్ ఆదివారం స్నేహితులతో కలిసి టేకుమట్ల మండలకేంద్రంలో మద్యం తాగాడు. రాత్రి తిరిగి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా రాఘవాపూర్– గిద్దెముత్తారం గ్రామాల మధ్య ప్రధాన రహదారి వెంట ఉన్న చెట్టును వేగంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి గట్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

కోర్టు వాయిదాలకు హాజరుకాని వ్యక్తి అరెస్ట్

పలిమెల, జనవరి 3 : మహదేవపూర్ మండలం ఎల్కేశ్వరం గ్రామానికి చెందిన కోల రవీందర్ కోర్టు వాయిదాలకు హాజరు కాకపోవడంతో మేజిస్ట్రేట్ వారెంట్ ఇవ్వగా సోమవారం ఎస్సై అతడిని అరెస్ట్ చేసి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. అనంతరం రవీందర్‌ను పరకాల జైల్‌కు తరలింటచినట్లు ఎస్సై తెలిపారు.

అంటే ఉన్నది..

ప్రమాదకంగా తెగిపోయేలా ఉన్న విద్యుత్ తీగలు

గుమ్మడిదొడ్డి గ్రామంలో విద్యుత్‌లైన్‌లో తెగిపోయేలా ఉన్న వైరు

వాజేడు, ఫిబ్రవరి 3 : మండలంలోని గుమ్మడిదొడ్డి గ్రామ కేఎన్‌ఆర్ రెస్టారెంట్‌కు వెళ్లే వీధిలో విద్యుత్ స్తంభాల లైన్‌లోని తీగ తెగిపోయేలా ఉంది. ఒక తీగకు అంటు మాత్రమే ఉండడంతో ఎప్పుడు తెగి కిందపడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. విద్యుత్ అధికారులు స్పందించి దానిని సరి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేకపోతే ప్రజల ప్రాణాలు పోయే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై వాజేడు ట్రాన్స్‌కో ఏఈఈ అర్షద్‌అహ్మద్ ను ‘నమస్తే తెలంగాణ’ వివరణ కోరగా విద్యుత్ లైన్లో తాటిచెట్లు ఉన్నాయని వాటిని తొలగించిన తర్వాత తీగలను సరిచేస్తామని తెలిపారు.


నగదు, నిత్యావసర సరకులు అందజేస్తున్న దాతలు

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఏటూరునాగారం, ఫిబ్రవరి 3 : మండల కేంద్రంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న నిరుపేద గంజి రంజిత్ దశదిన కర్మకు యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉండగా ఆర్థికంగా వెనుకబడి దశదిన కర్మ కూడా నిర్వహించుకోలేని స్థితిలో ఉన్నట్లు గుర్తించిన ఫౌండేషన్ సభ్యుడు గజ్జెల సతీశ్ పలువురి నుంచి విరాళాలు సేకరించారు. ఈ మేరకు బియ్యం, నిత్యావసర వస్తువులు, రూ.12వేల నగదును బాధిత కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో చామర్తి కిశోర్, సామల శివ, కోరం రవి, బత్తుల దేవేందర్, సులేమాన్ పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడి అధిగమించేందుకు క్రీడలు దోహదం

భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

పావురాలను ఎగరవేస్తూ క్రీడలను ప్రారంభిస్తున్న ముఖ్యఅతిథులు

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 3 : పోలీసు ఉద్యోగం శారీరక శ్రమ, మానసిక ఒత్తిడితో కూడుకున్నదని, దానిని అధిగమించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. జిల్లా పోలీసులకు వార్షిక క్రీడలు నిర్వహించడంతో పాటు, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ స్టేడియంలో వివిధ శాఖలు, యువతకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ క్రీడలకు ఎస్పీ కిరణ్‌ఖరే, జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్‌రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై క్రీడలను ప్రారంభించారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రత్నం ఆధ్వర్యంలో పరేడ్ నిర్వహించి ముఖ్య అతిథులకు గౌరవ వందనం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ఆడాలని కోరారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా క్రీడల నిర్వహణ జరుగుతుందని, మరో మూడు రోజులు క్రీడలు కొనసాగుతాయన్నారు. వాలీబాల్, క్రికెట్, క్రీడలను ముఖ్య అతిథులతోపాటు, అదనపు ఎస్పీలు ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి సీహెచ్ రఘు, అదనపు ఎస్పీ బోనాల కిషన్, ఏఆర్ అదనపు ఎస్పీ వేముల శ్రీనివాస్, సీఐలు నరేశ్‌కుమార్, మల్లేశ్, రామచంద్రరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు నగేశ్, రత్నం, కిరణ్, శ్రీకాంత్, ఎస్సైలు పాల్గొన్నారు.

నేడు క్రికెట్ ప్రిలిమినరీ లీగ్‌లో 8 మ్యాచ్‌లు

భూపాలపల్లి రూరల్ : ప్రిలిమినరీ లీగ్ క్రికెట్ పోటీల్లో మంగళవారం ఎనిమిది మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు సీఐ నరేశ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 7 గంటలకు జ్యుడీషియరీ వర్సెస్ టీజీ జెన్‌కో, 9.30 గంటలకు చిట్యాల వర్సెస్ అడవీముత్తారం, మధ్యాహ్నం 12 గంటలకు ఎస్‌సీసీఎల్ వర్సెస్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, సాయంత్రం 3 గంటలకు టీజీఎస్‌పీ వర్సెస్ అడ్వకేట్స్ టీంలకు క్రికెట్ పోటీలు ఉంటాయన్నారు. సుభాష్‌కాలనీ కాకతీయ స్టేడియంలో ఉదయం 7 గంటలకు భూపాలపల్లి–2 వర్సెస్ చెల్పూర్, 9.30 గంటలకు భూపాలపల్లి–3 వర్సెస్ మహదేవ్‌పూర్, మధ్యాహ్నం 12 గంటలకు భూపాలపల్లి–4 వర్సెస్ రేగొండ, సాయంత్రం 3 గంటలకు భూపాలపల్లి–5 వర్సెస్ రేగొండ–2 టీంల మధ్య పోటీలు జరుగుతాయని సీఐ తెలిపారు.

ప్రతిభను పెంపొందించడానికి టాస్క్ శిక్షణ

ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర

మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ దివాకర

ములుగురూరల్, జనవరి 3 : నిరుద్యోగ యువతలో ప్రతిభ నైపుణ్యాన్ని పెంపొందించడానికి టాస్క్ ద్వారా శిక్షణ, ఉద్యోగ అవకాశాలు ఇవ్వనున్నట్లు ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. జిల్లా కేంద్రంలోని టాస్క్ రీజినల్ సెంటర్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. టెక్నికల్, నాన్ టెక్నికల్ కోర్సుల్లో డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ విద్యార్థులు ఈ శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణలో జావా ప్రోగ్రామింగ్, వెబ్ డెవలప్‌మెంట్, పైథాన్ ప్రోగ్రామింగ్, డేటాబేస్ అప్లికేషన్, సీ ప్రోగ్రామింగ్, బేటా స్ట్రక్చర్స్, అల్గోరిథమ్స్, సూడో కోడ్, ఫుల్ స్టాక్, అప్లికేషన్స్‌లో మెళకువలను నేర్పించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 96184 49360 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రీజినల్ సెంటర్ హెడ్ నవీన్‌రెడ్డి, క్లస్టర్ మేనేజర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

టీజీవో డైరీ ఆవిష్కరణ

కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీని కలెక్టర్ టీఎస్ దివాకర ఆవిష్కరించారు. జిల్లా అభివృద్ధిలో టీజీవో గొప్ప పాత్రను పోషించాలన్నారు. టీజీవో జిల్లా అధ్యక్షుడు ఎం సంపత్‌రావు మాట్లాడుతూ టీజీవోలు ఐకమత్యంగా ఉండాలన్నారు. త్వరలో టీజీవో భవనానికి శంకుస్థాపన ఉటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, టీజీవో జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల జీవన్‌కుమార్, సహాధ్యక్షుడు ఆర్ . రామకృష్ణ, కోశాధికారి ప్రకాశ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కే కొమురయ్య, శ్రీనివాస్, శిరీష, రాజు, వెంకటరమణ, దేవరాజు, జితేందర్‌రెడ్డి, శైలజ, యశ్వంత శంకర్, శ్రీకాంత్, బాలయ్య, నరసింహ, సారంగపాణి, రఫీక్, రహీమ్, రాజ్‌కుమార్, రాజేశ్వరరావు, రహీమ్ అహ్మద్, రంజిత్, దేవేందర్ రావు, రాజు, మాధవి శీతల్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీజీఎం ఐటీ హరిప్రసాద్

సింగరేణిలో ఏప్రిల్ 1 నుంచి ఈ- ఆఫీస్ కార్యకలాపాలు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 3 : సింగరేణిలో ఏప్రిల్ 1 నుంచి ఈ–ఆఫీస్ ద్వారా కార్యకలాపాలు నడపాలని ఈఆర్పీ ప్రాజెక్ట్ మేనేజర్ డీజీఎం ఐటీ హరిప్రసాద్ అన్నారు. యాజమాన్యం నిర్ణయం మేరకు సోమవారం భూపాలపల్లి జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో సింగరేణి అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుంచి ఎఫ్‌ఎల్‌ఎం ఫైల్ లైఫ్ సైకిల్ మేనేజ్ మెంట్ ద్వారా కాగిత రహిత కార్యాలయ నిర్వహణ జరుగుతుందని తెలిపారు. అన్ని ఏరియాల్లోని శాఖాధిపతులకు తొలివిడత శిక్షణ చేపట్టామన్నారు. అందులో భాగంగానే భూపాలపల్లి హెచ్‌ఓడీ లకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ ఐటీ కిరణ్‌కుమార్, సీనియర్ ప్రోగ్రామర్ శంకర్, ట్రైనీ ప్రోగ్రామర్ రమ్య, డీజీఎం వీటీసీ పాఠక్, ఐటీ డిప్యూటీ మేనేజర్ రజనీకుమార్ పాల్గొన్నారు.

నాగిరెడ్డి మరణం తీరని లోటు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 3 : సీపీఎం సీనియర్ నాయకుడు సామ నాగిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని పస్రా గ్రామంలో నాగిరెడ్డి సంతాప సభను సోమవారం నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యుడు తీగల ఆదిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో కృష్ణారెడ్డి మాట్లాడుతూ 40 ఏళ్లుగా నాగిరెడ్డికి పార్టీతో అనుబంధం ఉందన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, టీటీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యానాల అనంతరెడ్డి, మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి, నాయకులు పోశాలు, మురళి, సదానందం, కృష్ణారావు, కవిత, రాజేశ్వరి, ఉపేంద్రాచారి పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ఏటూరునాగారం, ఫిబ్రవరి 3 : జాతీయ మానవ హక్కుల కమిటీ మండల అధ్యక్షుడు గంపల శివకుమార్‌ను రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య పరామర్శించారు. శివకుమార్ సోదరుడు రవి ఇటీవల మృతి చెందగా సోమవారం దశదినకర్మకు భద్రయ్య హాజరయ్యారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు పెట్టెం రాజు, నాయకులు గాదె శ్రీనివాస్, సన్నగుండ్ల వెంకటేశ్వర్లు, వీరమల్ల రాము, అల్లంల చంటి యాదవ్ ఉన్నారు.

మేడారంలో భక్తుల నిలువుదోపిడీ

- జత కొబ్బరికాయలు రూ.100, అరకిలో బెల్లం రూ.80
- పట్టించుకోని దేవాదాయశాఖ అధికారులు

ప్రదాన ద్వారం వద్ద కొబ్బరి, బెల్లం కొనుగోలు చేస్తున్న భక్తులు

తాడ్వాయి, ఫిబ్రవరి 3 : మేడారంలో భక్తులను స్థానిక వ్యాపారులు నిలువుదోపిడీ చేస్తున్నారు. తల్లులకు సమర్పించేందుకు కొబ్బరి, బెల్లం కొనే భక్తులను డబుల్ రేట్లతో బెంబేలెత్తిస్తున్నారు. ఈనెల 12 నుంచి సమ్మక్క, సారలమ్మ మినీ జాతర జరుగనుండడంతో ముందస్తుగా తల్లులకు మొక్కులు చెల్లించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఇదే అదునుగా భావించి గద్దెలకు ఎదురుగా ఉన్న ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసుకున్న కొబ్బరి, బెల్లం షాపుల్లో జత కొబ్బరి కాయలు రూ.100, పావుకిలో బెల్లం ముద్దలు ఒక్కోటి రూ.40 విక్రయిస్తున్నారు. ధరలపై భక్తులు ప్రశ్నిస్తే ఇష్టం ఉంటే తీసుకో లేకుంటే వెళ్లిపో అని అంటున్నారని వాపోతున్నారు. నెల రోజులుగా అధిక ధరలకు బెల్లం, కొబ్బరి విక్రయాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అధిక ధరలను నియంత్రించాలని భక్తులు కోరుతున్నారు.

వైద్యుడితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

ములుగులో కంటి వైద్య శిబిరం

ములుగురూరల్, ఫిబ్రవరి 3 : జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు భూక్యా జంపన్న సోమవారం ఉచిత కంటి ఆపరేషన్ క్యాంపును నిర్వహించారు. ఈ క్యాంపును మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ సందర్శించి కంటి సమస్యలతో బాధపడుతున్న వారి సమస్యలను అడిగి తెలుసుకుని వైద్యులతో మాట్లాడారు. పేద ప్రజలకు ఏదో ఒక విధంగా సేవ చేస్తున్న జంపన్నను ఆయన అభినందించారు. జంపన్న మాట్లాడుతూ కంటి పరీక్షలతో పాటు బీపీ, షుగర్ పరీక్షలు సైతం నిర్వహించినట్లు చెప్పారు. 144 మందికి పరీక్షలు నిర్వహించి 22 మందిని కంటి ఆపరేషన్ల కోసం హైదరాబాద్ శంకర దవాఖానకు పంపించామన్నారు. కార్యక్రమంలో గండాలపు రాజు, గంగపుత్ర, వీరబోయిన రాజేందర్, బాదావత్ రాజ్‌కుమార్, అన్నారపు నాగర్జున, కన్నెబోయిన విక్రమ్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, సతీశ్, మంగులాల్, కిట్టునాయక్, జన్ను దేవేందర్, ప్రసాద్, నిరంజన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి జయరాంరెడ్డి

క్యాన్సర్‌తో అప్రమత్తంగా ఉండాలి

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 3 : మారుతున్న జీవన శైలి, అలవాట్లు క్యాన్సర్ వ్యాధికి కారణమవుతున్నాయని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కే జయరాంరెడ్డి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో భూపాలపల్లి పీహెచ్‌సీలో సోమవారం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకం, సిగరెట్లు తాగడం వల్ల క్యాన్సర్ వస్తున్నదన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకర అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ప్రియాంక, వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ రోహిణి పాల్గొన్నారు.

రోడ్డుపై ఖాళీ బిందెలను పెట్టి ధర్నా చేస్తున్న గ్రామస్తులు

తాగునీటి సమస్య పరిష్కరించాలని ధర్నా

వెంకటాపురం(నూగూరు), ఫిబ్రవరి 3 : తాగునీటి సమస్య తీర్చాలని డిమాండ్ చేస్తూ ములుగు జిల్లా వెంకటాపురం(నూగూరు) మండలం బోదాపురం గ్రామస్తులు సోమవారం రోడ్డుపై ఖాళీ బిందెలను పెట్టి ధర్నా చేశారు. 15 రోజుల క్రితం మంచినీటి ట్యాంకు మోటర్ మరమ్మతుకు గురైందని, అప్పటి నుంచి నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మోటర్ మరమ్మతు చేయించాలని పంచాయతీ అధికారులు, మండల అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తాగు నీరు లేక చిన్నా పెద్దా తల్లడిల్లాల్సి వస్తోందన్నారు. వేసవి మొదలు కాక ముందే గ్రామంలో నీటి సమస్య ఇలా ఉంటే వేసవిలో ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి, నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ధర్నా విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్‌రావు అక్కడికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చి ఆందోళనను విరమింపజేశారు.

మాట్లాడుతున్న అకడమిక్ మానిటరింగ్ అధికారి కాయిత లక్ష్మణ్

విద్యాప్రమాణాల పెంపునకు కృషి చేయాలి

గణపురం, ఫిబ్రవరి 3 : విద్యార్థుల్లో విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అకడమిక్ మానిటరింగ్ అధికారి కాయిత లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండలంలోని చెల్పూర్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లకు నిర్వహిస్తున్న కెరీర్ గైడెన్స్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలు, అంశాలను ఆయా పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. తద్వారా విద్యార్థుల ప్రవర్తనలో మార్పు తేవాలని సూచించారు. ఎంఈవో ఉప్పలయ్య, హెచ్‌ఎం కొలువుల అశోక్, రిసోర్స్ పర్సన్స్ చల్ల కిషన్ రెడ్డి, మమత, నరేందర్, వీరాటి అమల పాల్గొన్నారు.

పీహెచ్‌సీ, హెల్త్ సబ్‌సెంటర్ల పరిశీలన

వివరాలు సేకరిస్తున్న అధికారులు

మంగపేట/వెంకటాపురం(నూగూరు), ఫిబ్రవరి 3 : మంగపేట పీహెచ్‌సీ, చెరుపల్లి హెల్త్ సబ్ సెంటర్లతో పాటు వెంకటాపురం(నూగూరు) సీహెచ్‌సీలను సోమవారం పాపులేషన్ రీసెర్చ్ విభాగానికి చెందిన కేంద్ర వైద్య అధికారులు మురుగేషన్, సెంథిల్‌కుమార్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా దవాఖానలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, మందుల పంపిణీ, వసతులను పరిశీలించింది. అనంతరం సమస్యలను స్థానిక వైద్య సిబ్బందిని అధికారులు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలను సందర్శించి తాము చేసిన అధ్యయనాన్ని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. వైద్యులు అఖిల, తరుణ్, మనోజ్‌కుమార్, చిరంజీవి పాల్గొన్నారు.

‘అడవికి నిప్పు పెట్టొద్దు’

వాజేడు, ఫిబ్రవరి 3 : చీపుర్లు, ఇప్ప పువ్వు, బీడీ ఆకు సేకరణ, రొట్ట కొట్టే సమయంలో అడవికి నిప్పు పెట్టొద్దని అటవీశాఖ పూసూరు సెక్షన్ ఆఫీసర్ నాగమణి అన్నారు. సోమవారం మండలంలోని పూసూరు అటవీశాఖ బీట్ పరిధి పెనుగోలుకాలనీలో ‘అడవికి నిప్పు.. జీవరాశులకు ముప్పు’ అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అడవి జంతువులను వేటాడడం చట్ట రీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.